# నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 ఖమ్మం, శుక్రవారం 13 జూన్ 2025 SURYAPET


## • యోగా చేద్దాం రండి..: కలెక్టర్ తేజస్ పిలుపు



సూర్యాపేట, జూన్ 12: కలెక్టరేట్ ఆవరణలో 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కుమార్, రామకృష్ణ, విజయసారథి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి

### మోటారు వాహన తనిఖీ అధికారి ఎస్‌కే జిలానీ



కోదాడ రూరల్, జూన్ 12: కోదాడ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు తమ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మోటారు వాహన తనిఖీ అధికారి ఎస్‌కే జిలానీ కోరారు. గురువారం తమ కార్యాలయం వద్ద పాఠశాల బస్సు డ్రైవర్లతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో 220 స్కూల్, కాలేజీ బస్సులున్నాయని, ఇప్పటివరకు 95శాతం మంది ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. మిగిలినవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



దవాఖానలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో కోటిరత్నం

## చెప్పిందే వినాలి..

- సిబ్బందిపై వైద్యాధికారి, హెచ్‌ఐవో బెదిరింపులు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

పెన్‌పహాడ్, జూన్ 12: నేనే మంత్రి.. అతడే (హెచ్‌ఐవో) బాస్.. మేము చెప్పింది వినాల్సిందే.. మాకు ఎదురు మాట్లాడితే మీ భవిష్యత్ అంతే సంగతులు.. తాము అనుకున్న లక్ష్యానికి అడ్డు రావద్దని ఎక్కడికక్కడ బెదిరింపులతో చెక్ పెడుతున్నారు ఆ ఇద్దరు వైద్యాధికారులు. సిబ్బంది నుంచి చెక్కులు తీసుకొని ప్రజా సొమ్మును సొంత అకౌంట్లలోకి మార్చుకుంటూ లక్షల రూపాయలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలున్నాయి. సిబ్బంది ఇదేమని అడిగితే బెదిరింపులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ ఏకంగా కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయడం వాళ్ల వంతే అయింది. ఇటీవల ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యాధికారి తనపైనే సిబ్బంది ఫిర్యాదు ఇచ్చినందుకు తాను డ్యూటీ చేయలేకపోతున్నానని కలెక్టర్ ఎదుట బోరున విలపించగా.. కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈతంతు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో గురువారం వైద్యారోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో కోటిరత్నం విచారణ చేపట్టారు. మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి జూన్ 2న నిర్వహించిన ఏఎన్‌ఎంల సమావేశంలో రికార్డులు ఎందుకు తీసుకురాలేదని టేబుల్‌పై ఉన్న రికార్డును ఏఎన్‌ఎం ముఖంపై విసిరేశారు. గెటౌట్ అంటూ దురుసుగా ప్రవర్తించడంతో ఏఎన్‌ఎంలు అంతా కలిసి సమావేశ మందిరం నుంచి బైకాట్ చేశారు. హెచ్‌ఐవో చంద్రశేఖర్‌రావు, స్రవంతి కలిసి నిధులను సొంత అకౌంట్లోకి బదిలీ చేసుకొన్నట్లు ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. సమగ్ర విచారణ చేపట్టి తుది నివేదికను కలెక్టర్, డీఎంహెచ్‌వోకు అందజేస్తున్నట్లు డాక్టర్ కోటిరత్నం తెలిపారు.

## నకిలీ విత్తనాలతో

- ఆంధ్రా ప్రాంతం నుంచి విచ్చలవిడిగా సరఫరా
- జిల్లాలో 28 క్వింటాళ్ల నకిలీ విత్తనాల సీజ్

# దళారుల దందా!

జిల్లాలో విచ్చలవిడిగా నకిలీ పత్తి విత్తనాలు దొరుకుతున్నాయి. మోసాలకు అలవాటుపడ్డ దగాకోరులు రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్నారు. అధికారుల కండ్లుగప్పి నకిలీ విత్తనాలను ఆంధ్రా ప్రాంతం నుంచి గుట్టుచప్పుడు కాకుండా తెస్తున్నారు. దళారులు అమాయక రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు. తక్కువ ధరలకు వస్తున్నాయి... దిగుబడి బాగా వస్తుందని రైతులకు అంటగడుతున్నారు.



సూర్యాపేట, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వారం రోజుల్లోనే దాదాపు 70లక్షల విలువ చేసే 28 క్వింటాళ్ల పత్తి విత్తనాలు సీజ్ చేశారంటే నకిలీ విత్తనాల దందా ఏ రీతిన జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ స్థాయిలో నకిలీ విత్తనాల దందా లేదు. కేసీఆర్ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ నకిలీ విత్తనాలను అరికట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నకిలీ విత్తనాలు ఎంతో ప్రమాదకరమో.. రైతులను చైతన్యం చేసింది. ఒక్క నకిలీ గింజ కూడా రాకుండా కట్టడి చేసింది. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ రైతాంగం రికార్డు స్థాయి పంట పండించి దేశానికే ఆదర్శంగా నిలిచింది. కాంగ్రెస్ పాలనలో .విచ్చలవిడిగా నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు.

### ఆంధ్రా వ్యాపారులు... లోకల్ దళారులు

కొంతమంది ఆంధ్రా వ్యాపారులు.. స్థానికంగా దళారులను ఏర్పాటు చేసుకొని గుట్టు చప్పుడు కాకుండా ఆంధ్రా నుంచి నకిలీ విత్తనాలను తీసుకువస్తున్నారు. పంట బాగా వస్తుందని, తక్కువ ధరకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారు. పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా లభిస్తుండడం పట్ల అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్దిమంది రైతులు కక్కుర్తో, అత్యాశో.. అమాయకత్వమో.. తెలియదు కాని మోసపోతూనే ఉన్నారు. ఇటీవల పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు తిరుమలగిరి మండలంలో రూ.4,62,000 విలువ చేసే 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మోతె, ఆత్మకూర్.ఎస్ మండలాల పరిధిలో 65 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు సీజ్ చేసి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ లెక్కన వారం వ్యవధిలోనే దాదాపు 70 లక్షల విలువ చేసే 25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల లభ్యం కావడం పట్ల నకిలీ దందా ఏ రీతిన జరుగుతుందో ఇట్లే అర్థం చేసుకోవచ్చు.

### మాయమాటలకు మోసపోవద్దు



నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే వారి మాయ మాటలకు రైతులు మోసపోవద్దు. లైసెన్స్ లేని వారి వద్ద కొనుగోలు చేసి నష్టపోతే కంపెనీ నుంచి కానీ, డీలర్ నుంచి అయినా పరిహారం పొందే అవకాశం ఉండదు. ప్రభుత్వం సూచించే బ్రాండ్లను కొనుగోలు చేసి నష్టపోతే పరిహారం ఇప్పించేందుకు తాము పూర్తిగా సహకరిస్తాం. ఎవరైనా బ్రాండ్ లేకుండా ప్రభుత్వం సూచించిన కంపెనీలు కాకుండా ఇతరత్రా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. రైతులు అప్రమత్తంగా ఉండాలి. బయటి నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని ఎవరైనా వస్తే తమను సంప్రదించి మంచివా కాదా అనేది నిర్ధారించుకోవాలి.

\- శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

## ఓపెన్ స్కూల్ ఇంటర్, టెన్త్ ఫలితాలు విడుదల

- వారం తర్వాత ప్రకటించిన విద్యాశాఖపై విమర్శలు
- ఈనెల 18వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం

రామగిరి, జూన్ 12: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్, టెన్త్ చదివిన విద్యార్థులు ఏప్రిల్–2025లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ ఈనెల 6న విడుదల చేసింది. నల్లగొండ జిల్లా విద్యాశాఖ, ఓపెన్ స్కూల్ అధికారులు మాత్రం ఆ ఫలితాలను వారం రోజుల తర్వాత గురువారం ప్రకటించారు. వారం రోజుల తర్వాత వెల్లడించడంపై పలు అనుమానాలకు దారితీస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదోతరగతికి 2,537మంది హాజరు కాగా 1696 ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 4,561మందికి 2,735 ఉత్తీర్ణత సాధించగా 59.96 శాతం ఫలితాలు వచ్చాయి. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈనెల 18వరకు దరఖాస్తు చేయడానికి అవకాశం ఉంది. టెన్త్ రీకౌంటింగ్‌కు రూ.350, రీవెరిఫికేషన్‌కు రూ.1200, ఇంటర్మీడియట్ రీకౌంటింగ్‌కు రూ.400, రీవెరిఫికేషన్‌కు రూ.1200 మీ సేవ కేంద్రం లేదా ఇంటర్నెట్ సెంటర్‌లో చెల్లించి దరఖాస్తు సమర్పించాలని డీఈవో వెల్లడించారు.

# హామీలు విస్మరించిన కాంగ్రెస్

## రేవంత్ కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం

- కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- మోసం చేస్తే తిరుగుబాటు తప్పదు
- గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం),జూన్12: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ అంటేనే ఒక చరిత్ర అని ఆయన ఆనవాళ్లను చెరిపేస్తానని విర్రవీగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన వారికి ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా నిరుద్యోగ యువతి, యువకులు రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల 28వేల మంది దరఖాస్తులు చేసుకోవడంతో ప్రభుత్వం భయపడిందన్నారు. జూన్ 2న నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాలు అందజేసేందుకు మంజూరు పత్రాలు ఇస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాయిదాలు వేస్తూ నిరుద్యోగులను నిరాశపర్చిందన్నారు. బూటకం మాటలతో పరిపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దసరా పండుగలోపు ఇచ్చిన హామీలు నేరవేర్చకుంటే ప్రజల తిరుగుబాటుతప్పదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె భిక్షపతి, పూర్ణచందర్‌రాజు, బీసు ధనలక్ష్మి, మల్లేశంగౌడ్, కొరటికల్ మాజీ సర్పంచ్ కొల సత్తయ్యగౌడ్, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, యువజన విభాగం మండలాధ్యక్షుడు శంతన్‌రాజు, బీఆర్‌ఎస్వీ పట్టణాధ్యక్షుడు సతీశ్, సైదులు పాల్గొన్నారు.



తిరుమలాపూర్ సభలో పనులను వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

## బీఆర్‌ఎస్ మంజూరు చేసిన పనులకు

# కాంగ్రెస్ శంకుస్థాపన?

### సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి పనులు ప్రారంభం

బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపనలు చేస్తున్నది. ఆలేరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని కాంగ్రెస్ సర్కార్ గప్పాలు కొడుతున్నది. వాస్తవానికి ఈ పనులన్నీ బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసినవే.. ఇటీవల ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిరుమలాపూర్‌లో బహిరంగసభకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ హయాంలో శంకుస్థాపనలు చేసిన పనులకే తిరిగి శంకుస్థాపనలు చేశారు. సీఎం శంకుస్థాపన చేసిన గంధమల్ల జలాశయం, ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు కాల్వపల్లి, కొలనుపాక బ్రిడ్జీలు రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ మంజూరు చేసినవే.

యాదగిరిగుట్ట, జూన్ 12: యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని కేసీఆర్ ఎంతో అద్భుతంగా నిర్మించారు. ఇక్కడే వైద్య కళాశాల నిర్మించాలని సకల్పించారు. వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మల్లాపురం గ్రామంలో శాశ్వత వైద్య కళాశాల భవనం నిర్మించాలని యోచించారు. 2023 సెప్టెంబర్ 16న జీవో నంబర్ 85 ప్రకారం రూ. 183 కోట్ల పరిపాలన అనుమతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యుద్ధప్రాతిపదికన సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారే తప్ప.. వైద్య కళాశాల ఎక్కడ నిర్మిస్తారో స్పష్టత ఇవ్వలేదు.

### కేసీఆర్ సంకల్పం గంధమల్ల

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 15వ ప్యాకేజీ నిర్మాణంలో తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామం వద్ద ఉన్న చెరువును 9.86 టీఎంసీ సామర్థ్యంతో జలశయం నిర్మించాలని మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ. 860.25 కోట్ల నిధులను మంజూరు చేసింది. సుమారు 4,027 ఎకరాల వ్యవసాయం, అటవీ భూమితోపాటు గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలు పూర్తిగా ముంపు గురవుతాయని యోచించింది. అక్కడి రైతుల తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. దీంతో అప్పటి కేసీఆర్ సర్కార్ నీటి సామర్థ్యాన్ని 4.28 టీఎంసీలకు కుదించింది. గంధమల్లను రీడిజైన్ చేసింది. ఇందుకు గానూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 569.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీని ద్వారా కేవలం గంధమల్ల గ్రామంతోపాటు చుట్టూ ఉన్న 2500 ఎకరాల వ్యవసాయం, అటవీ భూమి ముంపు బారిన పడే అవకాశం ఉంది. ఈ డిజైన్‌ను సైతం అక్కడి గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించడంతో చేసేదేమీ లేక గంధమల్ల జలాశయం పనులను నిలిపివేశారు. ప్రస్తుతం 0.002 టీఎంసీ సామర్థ్యంతో ఉన్న గంధమల్ల చెరువులోకి కాళేశ్వరం జలాలను అందించాలని సంకల్పించి 1.48 టీఎంసీ నీటి సామర్థ్యం గల గంధమల్ల జలాశయాన్ని నిర్మించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. గుత్తా అమిత్‌రెడ్డి గత టెండర్లను దక్కించుకొని పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇది గమనించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం గంధమల్ల జలాశయాన్ని మేం ప్రతిపాదించాం. నిర్మాణం చేస్తామంటూ శంకుస్థాపన చేశారు.

### హైలెవల్ బ్రిడ్జీలు అప్పటివే..

కొలనుపాక గ్రామంతోపాటు రాజాపేట మండలంలోని కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జీ నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయి. కొలనుపాకలో సుమారు రూ. 4 కోట్లు, కాల్వపల్లిలో రూ. 10 కోట్లు నిధులు మంజూరు కాగా అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి 2023 ఆగస్టు 4వ తేదీన పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇదే పనులకు ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరిగి శంకుస్థాపనలు చేశారు. వేద పాఠశాలకు రాయగిరి రైల్వే స్టేషన్ వద్ద గల వేంకటేశ్వర స్వామివారి కొనేరు వద్ద గతేడాది 2023లోనే మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శంకుస్థాపనన చేశారు. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం వేద పాఠశాల స్థలాన్ని తన ఖాతాలో వేసుకున్నది. ఇలా బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన చాలా పనులకు మళ్లీ క్రాంగెస్ నాయకులు శంకుస్థాపన చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

# ఇక్కత్‌కు డిమాండ్

## మార్కెటింగ్ కల్పించేందుకు కృషి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 12 : పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు మంచి డిమాండ్ ఉన్నదని, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే చేనేత పరిశ్రమ, చేనేత కళాకారులను చేయూతనిచ్చే వారమవుతారని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం గవర్నర్ సతీమణి సుధాదేవ్‌వర్మతో కలిసి భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. చేనేత కార్మికుల యోగక్షేమాలు, చేనేత వృత్తిదారుల సాధకబాధకాలు తెలుసుకునేందుకు చేనేత కార్మికుల గృహాలను సందర్శించారు. చేనేత మగ్గంపై తయారు చేస్తున్న పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులను పరిశీలించారు. కార్మికుల సంక్షేమం, జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టూరిజం పార్కులోని మ్యూజియంలో దారం నుంచి వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఎంపిక చేసిన చేనేత కళాకారులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రపంచ సుందరీమణుల సందర్శనతో 30శాతం అమ్మకాలు పెరుగడం సంతోషమన్నారు. పోచంపల్లి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు అహ్మదాబాద్‌లోని ఎన్‌ఐటీ, ఐఐటీ సహకారంతో స్థానిక చేనేత కార్మికులతో కలిసి అధ్యయనం చేయాలన్నారు. ఇక్కత్ చేనేత వారసత్వంగా వస్తున్న కళ అని, హ్యాండ్లూమ్స్‌ను కూడా హ్యాండీక్రాఫ్ట్ కోవలోకి వస్తాయని పేర్కొన్నారు. పోచంపల్లి ప్రభుత్వ పాఠశాలకు డిజిలైటేషన్ కోసం రూ.10 లక్షల మంజూరు చేస్తున్నానని తెలిపారు. చేనేత కార్మికులకు వైద్య చికిత్స కోసం లాంబార్డ్ హెల్త్ కార్డు ఏర్పాటు, చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

### పద్మశ్రీ అభినందనీయం

అత్యంత ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డు పొందిన వారు పోచంపల్లిలో ఉండడం అభినందనీయమని, ఇక్కత్ చీరలు ఖండాంతర ఖ్యాతి గాడించాయని అన్నారు. చేనేత జౌలి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ రాష్ట్రంలో టెస్కో ద్వారా చేనేత మెటీరియల్‌ను సేకరిస్తున్నామని, ఈ ఏడాది పోచంపల్లి రూ.ఆరు కోట్లతో మెటీరియల్‌ను సేకరిస్తున్నట్లు తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ రాకతో పోచంపల్లి మరోసారి ప్రాచుర్యం పొందిందన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఐఐటీ, ఎన్‌ఐటీ ద్వారా పోచంపల్లి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం నేతన్న బీమా పథకం కింద గర్దాస్ ఉపేందర్, వల్లకాటి భాగ్యలక్ష్మి, వనం యాదగిరికి రూ.ఐదు లక్షలు బీమా చెక్కులు, నేతన్న పొదుపు స్కీం కింద రూ.2.17 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆకాంక్షయాదవ్, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖాబాబురావు, వెంకటేశ్వరరావు, ఇందుమతి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తదితరులు



## మోగిన బడిగంట

రామగిరి, జూన్ 12: విద్యార్థులు సెలవులకు స్వస్తి చెప్పి బడిబాట పట్టారు. గురువారం పాఠశాలల్లో బడిగంట మోగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 4,381 పాఠశాలల్లో 5,34,502 మంది విద్యార్థులు బడిబాట పట్టారు. నూతన విద్యా సంవత్సరం 2025–26కు స్వాగతం పలుకుతూ ప్రభుత్వ పాఠశాలల ద్వారాలకు తోరణాలు కట్టారు. సర్వంగా సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాలలు కార్పొరేట్‌ను తలపించేలా విద్యార్థులకు స్వాగతం పలకడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.